క్లుప్తంగా

వినాయక ఉత్సవాలకు అంకురార్పణ



పందిరి రాట వేస్తున్న మహిళలు, యూత్ సభ్యులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం యాదవ యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం వినాయక ఉత్సవాల్లో కీలక ఘట్టమైన పందిరాటను నెలకొల్పారు. యాదవ్ యూత్ సభ్యులతో పాటు మహిళలు పూజల్లో పాల్గొన్నారు. యూత్ ప్రతినిధులు మాట్లాడుతూ పదేళ్ల నుంచి మల్కాపురం యాదవ వీధిలో వినాయక నవరాత్రి మహోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది కూడా విభిన్నంగా చేయాలనే ఆలోచనతో ఉన్నట్టు చెప్పారు.

తోటి కార్మికుడికి రూ. 70 వేల సాయం



తోటి కార్మికుడు రమణకు నగదు అందిస్తున్న ఆల్ ఆంధ్ర మ్యాజిక్ ఫ్రెండ్స్ సభ్యులు

సింధియా: వైజాగ్, గాజువాక టాటా మ్యాజిక్ సభ్యుడైన జీవీఎంసీ 62వ వార్డు ప్రకాష్‌నగర్‌కు చెందిన ఉల్లి రమణ గత నెల 15న గుండె ఆపరేషన్ చేయించుకున్నారు. అప్పటి నుంచి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడని తెలుసుకున్న తోటి కార్మికులు, ఆల్ ఆంధ్ర మ్యాజిక్ ఫ్రెండ్స్ సభ్యులు విరాళాలు సేకరించి శుక్రవారం రూ.70 వేలు రమణకు అందజేశారు. శ్రీలక్ష్మి గణపతి టాటా మ్యాజిక్ యూనియన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, తాతారావు, ఆల్ ఆంధ్ర మ్యాజిక్ ఫ్రెండ్స్ కోయిలగూడెం గ్రూప్ అడ్మిన్ సత్యనారాయణ, గాజువాక గ్రూప్ అడ్మిన్ రాంబాబు, గోపాలపురం అడ్మిన్ ప్రసాద్, కోయిలగూడెం ప్రెసిడెంట్ ధనరాజు, అడ్మిన్ అన్నవరం, కొండబాబు, నర్సీపట్నం అడ్మిన్ అశోక్ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణ లక్ష్మి పూజలు



కుంకుమార్చన లో పాల్గొన్న భక్తులు

మల్కాపురం: శ్రావణ మాసం నాలుగో శుక్రవారం సందర్భంగా స్థానిక దుర్గాదేవి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయంలో కొలువు దీరిన జై దుర్గా అమ్మవారికి భక్తులు పుష్పాలు,పసుపు,కుంకుమలతో అభిషేకాలు చేపట్టారు. పిండి వంటలు,పలు రకాల పండ్లను అమ్మవారికి సమర్పించారు.ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. పూజల్లో పారిశ్రామిక ప్రాంతం నలుమూల నుంచి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి పుష్పాలతో అర్చనలు చేపట్టారు.

దుర్గమాంబకు పూజలు



అలంకరణలో అమ్మవారు

కంచరపాలెం: గొల్లకంచరపాలెం దుర్గమాంబ ఆలయంలో శ్రీరామా సేవా సమాజం(యాదవ్) ఆధ్వర్యంలో శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం పూజలు ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ నేతృత్వంలో గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కుంకుమ పూజలు జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. గ్రామ ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఉపాధి కరువు.. బతుకు బరువు

నిర్మాణ కార్మికుల కంట్లో ఇసుక

ఇసుక అందుబాటులో లేదు..భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేదు. ఇసుక ఉచితంగా ఇస్తామని ప్రస్తుత పాలకులు చెప్పడంతో భవన నిర్మాణ కార్మికులు వారికి క్షీరాభిషేకాలు చేశారు. ఇప్పుడు ఇసుక అందుబాటులో లేకపోవడంతో ఉపాధి లేక కార్మికులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో తమకు కావాల్సినంత ఇసుక ఇచ్చే వారని, ఇప్పుడు కోత విధించారని భవన నిర్మాణ కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పనులు లేక ఆందోళన బాట పట్టిన భవన నిర్మాణ కార్మికులు

- ప్రచారంలోనే ఉచిత ఇసుక
- భారం అవుతున్న రవాణా చార్జీలు
- నిలిచిన భవన నిర్మాణ పనులు
- అవస్థలు పడుతున్న భవన నిర్మాణ కార్మికులు

మల్కాపురం: కూటమి ప్రభుత్వం ఇసుక పాలసీతో భవన నిర్మాణ రంగ కార్మికులు పస్తులు ఉంటున్నారు. పని దొరక్క అడ్డాపై నిరీక్షించి ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు. ఉచిత ఇసుక అంటూ ధర మోత మోగడంతో నిర్మాణ పనులు మందగించాయి.

గత ప్రభుత్వంలో ఇసుక ధర ఇలా..

గత ప్రభుత్వంలో టన్ను ఇసుక ధర రవాణా చార్జీతో కలిపి రాజమండ్రి వద్ద రూ. 900 ఉండేది. అప్పుడు బ్రోకర్ల ప్రమేయం లేకుండా కావాల్సినంత ఇసుక వచ్చేది.

ప్రస్తుతం ఇలా..

అదే ఇసుక టన్ను రూ. 2 వేలు పెట్టాల్సి వస్తోంది. నాడు ఎంత కావాలంటే అంత ఇసుక ఇచ్చే వారు. నేడు కేవలం 10 టన్నులకే పరిమితం చేశారు. అప్పట్లో 20 టన్నుల ఇసుక రాజమండ్రి నుంచి విశాఖ వచ్చేందుకు ఎంత ఖర్చు అయ్యేదో ఇప్పుడు పది టన్నులకు అదే రవాణా చార్జీ అవుతోందని నిర్మాణదారులు వాపోతున్నారు.

5వేల మందికి అవస్థలు

పారిశ్రామిక ప్రాంతంలో సుమారు 5 వేల మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన రెండు వారాల్లోనే ఫ్రీ ఇసుక అందుబాటులోకి వస్తుందని పారిశ్రామిక ప్రాంత భవన నిర్మాణ కార్మికులందరితో చంద్రబాబు నాయుడు ఫొటోకు క్షీరాభిషేకం చేయించుకున్నారు. నేడు ఇసుక, ట్రాన్స్‌పోర్టు చార్జీలు పెరగడం , కావాల్సినంత ఇసుక లభ్యం కాక పోవడంతో ఉపాధి కరువైంది. దీంతో కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజులుగా మల్కాపురం, ప్రకాష్‌నగర్ తదితర ప్రాంతాల్లో అడ్డాలకు చేరుకొని పని లేక ఉసూరు మంటూ ఇంటిబాట పడుతున్నామని భవన నిర్మాణ కార్మికులు వాపోతున్నారు.

ఇసుక కొనలేకపోతున్నాం



గత ప్రభుత్వంలో మాకు కావాల్సినంత ఇసుక అందుబాటులో ఉండేది.నేడు ఆ పరిస్థితి లేదు. స్టాక్ పాయింట్ల వద్ద కేవలం పది టన్నులు మాత్రమే ఇస్తున్నారు.అప్పుడు 20 టన్నులకు ట్రాన్స్‌పోర్టు చార్జీ 16 వేలు అయ్యేది. నేడు పది టన్నులకే రూ.16 వేలు చార్జి చేస్తున్నారు.అదే 20 టన్నులు కావాలంటే రూ. 32 వేలు ట్రాన్స్‌పోర్టు చార్జీ అవుతుంది. ఇదేనా ఫ్రీ ఇసుక అంటే.

– శంకరరావు , భవన నిర్మాణ కాంట్రాక్టర్

ఉపాధి లేక ఇబ్బందులు



నేడు ఇసుక అందుబాటులో లేకపోవడంతో నిర్మాణ పనులు తగ్గిపోయాయి. 20 రోజుల నుంచి నిర్మాణ పనులు దొరకడం లేదు. దీంతో చిన్న చిన్న కూలి పనులు చేసుకుంటూ పూట గడపుతున్నాం. పాలకులు మా పరిస్థితిని అర్థం చేసుకొని ఇసుక ధరలు తగ్గించడంతో పాటు అవసరమైనంత ఇవ్వాలి. – పి.ధనమ్మ, భవన నిర్మాణ కార్మికురాలు

పనులు ఆపేశారు



గతంలో ఎక్కడో ఓ చోట భవన నిర్మాణ పనులు ఉండేవి.అడ్డాపై వచ్చి ఉంటే పనికి తీసుకెళ్లిపోయేవారు. ఇసుక అందుబాటులో లేదని కాంట్రాక్టర్లు పనులు ఆపేశారు. 30 రోజుల నుంచి ఉపాధి లేదు.కూలి పనుల కోసం తిరాగాల్సిన పరిస్థితి వచ్చింది. అప్పులు చేసుకుని జీవనం సాగిస్తున్నాం.

– తావాడ రాజు, భవన నిర్మాణ కార్మికుడు

ఉచిత ఇసుక ఏదీ?



ఫ్రీగా ఇసుక అందుబాటులోకి తెస్తాం అన్నారు. మాకు ఇక చేతి నిండా పని ఉంటుందని ఆశించాం. నేడు ఆ పరిస్థితి లేదు. ఇసుక ధర ట్రాన్స్‌పోర్టు చార్జీలతో కలిసి పెరగడంతో 20 రోజుల నుంచి పారిశ్రామిక ప్రాంతంలో ఒక లోడు ఇసుక కూడా రాలేదు. కావాలంటే బ్లాక్‌లో ఇసుక కొనాల్సిన పరిస్థితి వచ్చింది. మా కష్టాలు ఎప్పుడు తీరుతాయో అని ఎదురు చూస్తున్నాం.

– మోహన్‌రావు, తాపీ మేస్త్రి

హోంగార్డ్ కుటుంబానికి ఆర్థిక సాయం



హోంగార్డు భార్యకు చెక్కు అందజేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

విశాఖ సిటీ : అకాల మరణం చెందిన హోంగార్డ్ మహ్మద్ హసమ్ కుటుంబానికి నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి చేతుల మీదుగా ఆర్థిక సాయం అందించారు. నగర పోలీస్ శాఖలో హసమ్ గత 19 ఏళ్లుగా విధులు నిర్వర్తిన్నారు. న్యూరో సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతూ ఈ నెల 15వ తేదీన మరణించారు. అతని కుటుంబానికి హోంగార్డ్ వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ.10 వేలు, ఫ్లాగ్ ఫండ్ నుంచి రూ.10 వేలు మంజూరు చేశారు. హోంగార్డ్ భార్య జరీనా కౌశర్‌కు శుక్రవారం రూ.20 వేల చెక్కును అందజేశారు.

నేడు, రేపు కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: ప్రతికూల వాతావరణం, భారీ వర్షాల కారణంగా విశాఖపట్నం–కిరండూల్–విశాఖపట్నం(18514/18513) నైట్ ఎక్స్‌ప్రెస్ శని, ఆదివారాల్లో) దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. విశాఖపట్నం–కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 31, సెప్టెంబరు 1 తేదీల్లో వయా విజయనగరం, రాయగడ, కోరాపుట్ మీదుగా దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఆగస్టు 31, సెప్టెంబరు 1 తేదీల్లో కిరండూల్ నుంచి బయల్దేరవలసిన కిరండూల్–విశాఖపట్నం(18513) నైట్ ఎక్స్‌ప్రెస్ దంతేవాడ నుంచి బయల్దేరి వయా కోరాపుట్, రాయగడ, విజయనగరం మీదుగా విశాఖ చేరుకుంటుంది.

మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు



మాట్లాడుతున్న విశ్రాంత ఏఎస్పీ సత్యనారాయణ



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

- విశ్రాంత ఏఎస్పీ సత్యనారాయణ

గోపాలపట్నం: యువత లక్ష్యం వైపు అడుగులు వేయాలని.. జల్సాలకు అలవాటు పాడితే జీవితం బుగ్గి పాలవుతుందని విశ్రాంత ఏఎస్పీ కె. సత్యనారాయణ అన్నారు. నరవలోని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో శుక్రవారం డ్రగ్స్, సైబర్ క్రైంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడవద్దని జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. సైబర్ నేరగాళ్ల వలలో పడవద్దని సూచించారు. స్మార్ట్ ఫోన్ల వాడకం పెరిగిన తర్వాత సైబర్ క్రైం పెరిగిందన్నారు. సెల్ ఫోన్లకు తెలియని వ్యక్తులు, సంస్థలు పంపిన మెసేజులు ఓపెన్ చేయవద్దని తెలిపారు. లాటరీ వచ్చిందని లక్షల్లో డబ్బులు వస్తాయని వచ్చే మెసేజీలు నమ్మవద్దని కోరారు విద్యార్థి దశ నుంచే మంచి నడవడిక, సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలన్నారు. పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీ ప్రదీప్ వర్మ, డీన్ డాక్టర్ శాంతారావు, ఉమెన్స్ గ్రీవెన్స్ సెల్ కోఆర్డినేటర్ కె. దయానా తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలవెన్స్ చెల్లించాలని నిరసన



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న గాజువాక ఆర్టీసీ డిపో కార్మికులు

మల్కాపురం : నేషనల్ మజ్దూర్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గాజువాక ఆర్టీసీ డిపో కార్మికులు శుక్రవారం మధ్యాహ్న భోజన విరామంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. గాజువాక ఆర్టీసీ డిపో వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి ఎన్ఎంయూ రాష్ట్ర నాయకుడు జి.ఆర్. రావు హాజరై మాట్లాడారు. గతంలో కార్మికులు రాత్రి విధులు నిర్వహించినా, పగలు విధులు నిర్వహించినా ప్రత్యేక అలవెన్స్ ఇచ్చేవారని గుర్తు చేశారు. నేడు ఆ పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మొత్తం ఎన్ని డిపోలున్నాయో అన్ని డిపోల్లోని కార్మికులకు డే, నైట్ డ్యూటీల ప్రత్యేక అలవెన్స్ నిలిపివేయడం దారుణం అన్నారు. ప్రభుత్వం ఈ సమస్యపై స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా నేడు అన్ని డిపోల పరిధిలో నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాలు సాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూ ప్రతినిధులు చిట్టిబాబు, బి.ఎం.రావు, వి.ఎస్.ఆర్. రావు, నీలకంఠం, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



గోపాలపట్నం హైస్కూల్లో మొక్క నాటుతున్న కమిషనర్ సంపత్ కుమార్, ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం : నగర పాలక సంస్థ కమిషనర్ పి. సంపత్ కుమార్ శుక్రవారం జీవీఎంసీ 89, 92 వార్డుల్లో పర్యటించారు. ఆయనతో పాటు ఎమ్మెల్యే గణబాబు ఉన్నారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ పాఠశాలలో వన మహోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ఇక్కడి మైదానంలో నీరు నిల్వ ఉండిపోతోందని, దీని వల్ల వాకింగ్ చేసేవారు, ఆటలకు వచ్చేవారికి ఇబ్బందిగా ఉందని ఎమ్మెల్యే ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రీడా ప్రాంగణంలో వర్షం నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మొక్కలు నాటడం పర్యావరణానికి ఎంతో అవసరమన్నారు. తొలుత 89వ వార్డులో చంద్రనగర్, కొత్తపాలెంలో పర్యటించారు. ఇక్కడి ప్రధాన రహదారిలో కాల్వలు లేకపోవడం వల్ల వర్షం నీరు రదారులపై నిల్వ ఉండిపోవడంతో గుంతలు ఏర్పడుతున్నాయని ఎమ్మెల్యే కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. చంద్రనగర్ వద్ద కొత్తగా నిర్మించిన అండర్ పాస్‌వేలో వర్షం నీరు ఉండిపోవడం వల్ల ఇబ్బంది ఏర్పడుతోందని, ఈ నీటిని వెంటనే బయటికి పంపే ఏర్పాటు చేయాలని కోరారు. కొత్తపాలెం నుంచి నరవ వెళ్లే రహదారిలో వర్షాకాలంలో రహదారిపై నీరు ప్రవహించడం వల్ల ప్రయాణికులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు కమిషనర్‌కు తెలిపారు. మేహాద్రిగెడ్డ గేట్లు ఎత్తితే ఈ ప్రాంతం ముంపునకు గురవుతుందని తెలిపారు. దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఆయా సమస్యలను కమిషనర్ పరిశీలించి అధికారులతో చర్చించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కమిషనర్ తెలిపారు. ఆయనతో పాటు చీఫ్ ఇంజినీర్ వినయ్‌కుమార్, జోనల్ కమిషనర్ హేమావతి, కార్పొరేటర్లు దాడి వెంకట రమేష్, బొమ్మిడి రమణ, పట్టణ ప్రణాళిక అధికారి సురేష్ కుమార్, ప్రధాన వైద్యాధికారి నరేష్ కుమార్, పర్యవేక్షక ఇంజినీర్ రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి తరానికి స్వచ్ఛమైన ఆక్సిజన్ అందిద్దాం



కొత్తపాలెం హైస్కూల్లో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, జేడీ ఫౌండేషన్ సభ్యులు

గోపాలపట్నం : రేపటి తరానికి స్వచ్ఛమైన ఆక్సిజన్ అందించేందుకు అందరం నడుం బిగిద్దామని జేడీ ఫౌండేషన్ సభ్యులు నినదించారు. కొత్తపాలెం హైస్కూల్ ప్రాంగణంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకట రమేష్ పాల్గొని మొక్కలు నాటి మాట్లాడారు. పాఠశాలల్లో మొక్కలు నాటడం వల్ల విద్యార్థుల్లో మొక్కల పెంపకంపై అవగాహన కలుగుతుందని తెలిపారు. మొక్కలు నాటడమే కాకుండా అవి చక్కగా పెరిగేలా ఆ బాధ్యతను విద్యార్థులకు అప్పగించడం మంచి నిర్ణయమన్నారు. రెండేళ్ల క్రితం నాటిన మొక్కలు ఏపుగా పెరగడం సంతోషాన్నిస్తోందని జేడీ ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రత్నమాల, పర్యావరణ ప్రేమికుడు భూషణం మాస్టారు, బాబూరావు మాస్టారు, పిన్నమనేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్ కార్మికుల ధర్నా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని స్టీల్ సీఐటీయూ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సమస్యలపై శుక్రవారం సాయంత్రం ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద ధర్నా చేశారు. నాయకులు మాట్లాడుతూ బయోమెట్రిక్ పద్ధతిలో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. పాత పద్ధతిలో కార్మికులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు 26 రోజులు పని కల్పించాలన్నారు. అనంతరం సీజీఎం (వర్క్స్) యు. శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.ఎం. శ్రీనివాసరావు, జి. శ్రీనివాసరావు, ఓ.వి. రావు, నమ్మి రమణ తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ స్కీమే అమలు చేయాలని నిరసన



ఎన్ఎడీ మెయిన్ గేటు వద్ద నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

గోపాలపట్నం : ఎన్‌పీఎస్, యూపీఎస్ వద్దు, పాత పెన్షన్ స్కీమే ముద్దు అని ఎన్ఏడీ సీఈ యూనియన్ మెయిన్ గేటు వద్ద యూనియన్ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల జీవితాలతో ఆటలాడుతోందని మండిపడ్డారు. యూపీఎస్‌కు వ్యతిరేకంగా మానవహారం నిర్వహించారు. అనంతరం కాకానినగర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈ యూనియన్ నాయకుడు టి. శ్రీనివాస్ మాట్లాడుతూ వామపక్ష సంఘాలు, రక్షణ రంగంలో ఏఐడీఈఎఫ్, సిగ్రా వంటి పలు సంఘాలు యూపీఎఫ్‌ను వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఐడీఈఎఫ్ యూనియన్ పోరాటాలు చేస్తోందని తెలిపారు. పాత పెన్షన్ విధానం అమలయ్యే వరకు సీఈ యూనియన్ పోరాటాలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఫెన్స్ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ రెడ్డి వెంకటరావు, సీఈ యూనియన్ నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులకు చెక్



60వ వార్డులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ పి.వి.సురేష్



61వ వార్డులో..



మాట్లాడుతున్న కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు

మల్కాపురం: వాతావరణంలో మార్పుల వల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తున్నాయని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని 60వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ పి.వి.సురేష్ అన్నారు. ఫ్రై డే డ్రై డే కార్యక్రమంలో భాగంగా వార్డు శానిటరీ,మలేరియా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జవహర్‌నగర్‌లో దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రతలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ సురేష్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై దోమలు లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సతీష్‌తో కలిసి అవగాహన కల్పించారు.

- 59వ వార్డు ములగాడ హౌసింగ్‌కాలనీలో విద్యార్థులతో కలిసి వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ యాదవ్, శానిటరీ అధికారులు,సిబ్బందితో కలిసి ర్యాలీ చేపట్టారు.
- 61వ వార్డు మల్కాపురం వద్ద వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జి సోమేష్, సచివాలయ హెల్త్ సిబ్బంది,మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

62వ వార్డులో..

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురం గ్రామంలో శుక్రవారం డ్రైడే–ఫ్రైడేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ నవరత్నం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు, వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజలకు సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి వ్యాధుల నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మల్కాపురం మలేరియా నివారణ సూపర్‌వైజర్ దుల్లా శ్రీనివాసరావు, హెల్త్ సెక్రటరీ రమ్య, శానిటరీ సెక్రటరీలు వెంకునాయుడు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ పూర్తయింది.. రిలీవ్ చేయండి

- ఏఎన్ఎంల డిమాండ్



వైద్య ఆరోగ్య శాఖ ఆర్డీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఎన్ఎంలు

మహారాణిపేట: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం పరిధిలో రెండేళ్ల శిక్షణ పూర్తి చేసుకున్న తమను రిలీవ్ చేసి.. పనిచేసే ప్రాంతాలకు తిరిగి పంపాలని ఏఎన్ఎంలు డిమాండ్ చేశారు. రేసపువానిపాలెం వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం ఎదుట శుక్రవారం ఏఎన్ఎంలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు ఏఎన్ఎంలు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో రెండేళ్ల పాటు శిక్షణ పూర్తి చేశామని చెప్పారు. రెండేళ్ల కాలంలో మొదటి సంవత్సరం, రెండో సంవత్సరంగా విభజించి పరీక్షలు పూర్తి చేసి సర్టిఫికెట్లు ఇచ్చారని, ఇంకా తమను ఇక్కడ కొనసాగించడం అన్యాయమన్నారు. మార్చి నుంచి శిక్షణ పేరిట నెలనెలా పొడిగిస్తున్నారని.. ఇంకా పొడిగిస్తారో, రిలీవ్ చేస్తారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. సుదూర ప్రాంతాల నుంచి ప్రయాణాలు చేయలేక, ఉద్యోగం వదులు కోలేక, కుటుంబ సభ్యులకు దూరం అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. శారీరక, మానసిక సమస్యలను ఎదుర్కొంటూ ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తున్నామని చెప్పారు. తమ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రిలీవ్ చేయాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని వైద్య ఆరోగ్య శాఖ ఆర్డీకి సమర్పించారు.

ఉర్రూతలూగించిన మైకేల్ జాక్సన్ పాటలు



మైకేల్ జాక్సన్ పాటకు నోటితో సంగీతం అందిస్తున్న డీటీఎస్ రమేష్

మద్దిలపాలెం: ప్రసిద్ధ పాప్ కింగ్ మైకేల్ జాక్సన్ జయంతి వేడుకలను శుక్రవారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మిమిక్రీ కళాకారుడు రమేష్‌కుమార్(డీటీఎస్ రమేష్) తన గాత్రంతో నోటి ద్వారా మైకేల్ జాక్సన్ పాటలకు సంగీతాన్ని సమకూర్చిన ప్రదర్శనతో ఆహుతులను ఆకట్టుకున్నారు. ఎంజే సూపర్ హిట్ సాంగ్స్‌కు నోటితో సంగీతాన్ని ఇస్తూ ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. సుమారు 15 పాటలకు రమేష్ ధ్వని అనుకరణతో మ్యూజిక్ హోరెత్తించారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, ఖాన్‌లు ప్రసంగిస్తూ మైకేల్ జాక్సన్ పాటలకు నోటి ద్వారా సంగీతం సమకూర్చడం అద్భుత ప్రక్రియ అన్నారు. రమేష్ ప్రతిభ నలుదిశలా తెలియాలని ఆకాంక్షించారు. డీటీఎస్ రమేష్ మాట్లాడుతూ నోటి ద్వారా సంగీత ధ్వని అనుకరణతో జరిగే ఈ ప్రక్రియకు పలు ప్రదర్శనల్లో విశేష ఆదరణ దక్కిందన్నారు. కార్యక్రమంలో విజయ్ నిర్మాణ్ కంపెనీ అధినేత విజయ్‌కుమార్, చెన్నా తిరుమలరావు, బాదంగీర్ సాయి, రిటైర్డ్ పోలీస్ అధికారి మహమ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.